క్లుప్తంగా

పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'మనఊరు మనబడి' అభివృద్ధి పనులను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య పరిశీలించారు. మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, బుదాకాలాన్ ఎస్టీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆకెనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులను నిషితంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని డీఈవో ఆదేశించారు. పనులను నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ వినయ్, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

దండేపల్లి/నెన్నెల/వేమనపల్లి: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 17న చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎండి అయూబ్‌ఖాన్, చంద్రమౌళి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రవికుమార్ తెలిపారు. దండేపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గురుకుల ఉపాధ్యాయులతో పాటు, సంఘ నాయకులు హాజరవ్వాలని కోరారు.

కబ్రస్థాన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సుమన్

మందమర్రిరూరల్: పట్టణంలో ముస్లింల కోసం ఏర్పాటు చేసిన కబ్రస్థాన్‌ను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. మతపెద్దలు మౌలానా అజాంఅలీ, అబ్బాస్, ఇస్హాక్, మజార్, సలావుద్దీన్, సుల్తాన్, యాకూబ్, మొహమ్మద్‌సాబ్, షరీఫ్, అహ్మద్ అలీ, సర్వర్, జావీద్‌బాషా, చాంద్‌పాషా, మున్వర్, బాబా, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు చేయి నొప్పితో బాధపడుతుండగా ఆయన ఇంటికి వెళ్లి సుమన్ పరామర్శించారు. పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పనులను, ఊరు మందమర్రి రోడ్డులోని ఊర చెరువు ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు.

స్పాట్ అడ్మిషన్లు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. మిగిలిన ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 15వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని బాలికలకు స్థానిక కళాశాలలో, బాలురకు జైపూర్‌లోని కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు వారి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కార్డెన్ సెర్చ్

లక్సెట్టిపేట: వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని స్థానిక సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని వీకర్స్ కాలనీలో శుక్రవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించి కాలనీవాసులతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటుపడొద్దని, భవిష్యత్‌పై దృష్టి ఉంచుకుని సన్మార్గంలో నడవాలని తెలిపారు. 20బైక్‌లను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

లక్సెట్టిపేట: మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతుందని, రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి, రోడ్డు బురదమయంకాగా శుక్రవారం గ్రామస్తులు రోడ్డుపై నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఊరూరా నిరసనలు..!

- కన్నెపల్లిలో చావుడప్పులతో ర్యాలీ
- పలుచోట్ల అధికారులకు వినతిపత్రాలు అందజేత
- సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ సిబ్బంది డిమాండ్

గ్రామ పంచాయతీల సిబ్బంది చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. సమస్యలు పరిష్కరించాలని ఊరూరా జీపీ కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న జీపీ ఉద్యోగులు

కాసిపేట: సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగి నిరసన దీక్షలు చేస్తున్న గ్రామపంచాయతీ కారోబార్లు, వర్కర్లు శుక్రవారం మండల కేంద్రంలో చావుడప్పులు కొడుతూ ర్యాలీ నిర్వహించారు. అన్ని రకాల పనులు చేస్తూ గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న తమను, ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని వెంటనే వేతనాల పెంపు, అర్హులకు పదోన్నతులు కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. దీక్ష శిబిరాన్ని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు దాసరపు రాజు సందర్శించి మద్దతు తెలిపారు.

వినతిపత్రాలు అందజేత

మందమర్రిరూరల్: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులు శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మికు వినతిపత్రం అందించారు. ఉద్యోగుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష తొమ్మిదో రోజు కొనసాగింది. వీరి దీక్షకు టీడీపీ చెన్నూర్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.

దండేపల్లి: సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ దండేపల్లిలో జీపీ కార్మికులు ఎంపీపీ గడ్డం శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సమస్యలపై మల్టీపర్పస్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించాలనే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హాజీపూర్ ఎంపీపీ స్వర్ణలతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని కార్మికులు విన్నవించారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ కార్మిక విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని తదితర సమస్యలపై నిరవధిక సమ్మె చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల ర్యాలీ

భీమిని: సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు శుక్రవారం చావు డప్పులతో ర్యాలీ తీశారు. ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం సీఐటీయూ, ఐఎఫ్‌టీ యూ, జేఏసీ సభ్యులతో పాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్స్ సమ్మెకు మద్దతు

చెన్నూర్‌రూరల్: మల్టీపర్పస్ వర్కర్స్ చేపట్టిన సమ్మెకు శుక్రవారం కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ల రాధిక మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మల్టీపర్పస్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని తెలిపారు. అలాగే అన్ని కార్మిక చట్టాలను అమలు చేసి జీవో నెం.51ను సవరించాలన్నారు.



కాసిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది



కన్నెపల్లిలో దప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నస్పూర్/లక్సెట్టిపేట/మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. నస్పూర్ పట్టణంలోని 11వ వార్డు ఫ్లడ్ కాలనీలో మైనార్టీ సంక్షేమ శాఖ గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు రూ.57.50లక్షలతో చేపట్టనున్న ఉర్దూఘర్ అండ్ షాదీఖానా భవన నిర్మాణానికి, లక్సెట్టిపేటలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ పనులకు, శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వివరించారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్‌చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మంచిర్యాల విశ్వనాథ కాలక్షేప మండపంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ధూప దీప అర్చక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావును పలువురు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, స్థానిక కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దామోదరచార్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్‌శర్మ, రవిపాండే, మధుశర్మ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 8మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. గొర్రెల యూనిట్లు పొందిన లబ్ధిదారులు గొర్రెల పెంపకంలో మెళుకువలు పాటించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గొర్రెల పెంపకంలో పశువైద్యాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, గొర్రెల సొసైటీ అధ్యక్షుడు మల్లేశ్, దొనబండ పశువైద్యాధికారి ఈ.సరిత, సిబ్బంది స్వప్న, గొల్ల కుర్మలు, రైతులు, పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

జన్నారం: మండలంలోని దేవునిగూడ గ్రామ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులకు ఎంపీఓ రమేశ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్త, ఇంకుడు గుంతలు, పారిశుధ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండలం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు దేవునిగూడ గ్రామ పంచాయతీ ఎంపిక కావడంతో, కేంద్ర పరిశీలన బృందం పర్యటించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీషరెడ్డి, ఏపీవో రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే'

చెన్నూర్: రాష్ట్రంలో రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇచ్చిందే కాంగ్రెస్ అని, ఉచిత విద్యుత్ పేరుతో రైతులకు చేస్తున్న మోసం బయటపడుతుందని బీఆర్‌ఎస్ అనవసరపు ఆందోళనలు చేస్తుందని పీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా నాయకులు జూల లక్ష్మణ్, నాయకులు సూర్యనారాయణ, లక్ష్మణ్, ఖలీల్, సూరజ్, రాజు, ఈర్ల నారాయణలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ మనోహర్ శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 16న మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని అన్నారు. జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు.

'తప్పులు లేకుండా చూడాలి'

కాసిపేట: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా బూత్‌లెవెల్ అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ సూచించారు. బీఎల్‌వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రెండుచోట్ల ఓటుహక్కు కలిగి ఉన్న ఓటర్లను గుర్తించి తొలగించడంతో పాటు, చనిపోయిన వారి ఓటు తీసివేయాలని, నూతన ఓటర్లను దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా గీతా హవన యజ్ఞం

శ్రీరాంపూర్: కృష్ణాకాలనీలోని గీతా ప్రశాంతి నిలయంలో గీతా హవన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. అర్ధచాతుర్మాస్య వ్రత దీక్షలో భాగంగా శుక్రవారం ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నవగ్రహాలకు, వినాయకుడికి, శ్రీ కృష్ణుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణం చేస్తూ పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. పెంచికల్‌పేట గీతాఆశ్రమం పీఠాధిపతులు దాసరి చంద్రమౌలర్యా రాజయోగి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. గీతా సత్సంగం గురువు దాసరి రాజేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ డీడీ ప్రసాద్, కార్యదర్శి రాజమౌళి, సభ్యులు గంగాధర్, తిరుపతి, మల్లేష్, రాజేశ్వరి, రమాదేవి స్వర్ణకుమారి, పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

దుర్గామాత ఆలయంలో హోమం

జన్నారం: మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం గ్రామానికి చెందిన 50జంటలు సామూహిక హోమాలు కాల్చారు. వేద పండితుల మంత్రాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జాడి రాజన్న, వెంకటి, లచ్చన్న, పోశన్న, చంద్రయ్య, రవి, శంకర్, రాజలింగు, మల్లేశ్, తిరుపతి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెండర్లు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు గాను సర్టిపై చేసేందుకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కన్సల్టెన్సీ కోసం సీల్డు కవర్లలో టెండర్లను ఆహ్వానించగా, 5కంపెనీలు టెండర్లను దాఖలు చేశాయి. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టెండర్లను కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో ఓపెన్ చేయగా, తక్కువ కమిషన్ 0.93శాతం గాయత్రి కన్సల్టెన్సీ వారు కోట్ చేయడంతో, వారికే ఆ టెండరును అప్పగించినట్లు కమిషనర్ తెలిపారు. రెండేళ్ల పాటు, మున్సిపాలిటీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను సదరు కన్సల్టెన్సీ వారు పరిశీలించి, క్వాలిటీ సర్టిఫికెట్‌లను ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

ఒక్క షాప్‌కే వేలం..

మున్సిపాలిటీ పరిధిలోని సంజీవయ్య కాలనీలో గల మటన్ మార్కెట్‌లో 16షాపులకు గాను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించగా, కేవలం 16వ నంబరు షాపునకు మాత్రమే ఇద్దరు వేలంలో పాల్గొన్నారు. అందులో సందీప్ అనే వ్యక్తి వేలంలో రూ.10,200 దక్కించుకున్నారు. మిగితా షాప్‌లకు ఎవరూ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపించకపోవడంతో, వాటిని మరోసారి వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. మేకల మండికి వేలం నిర్వహించగా, ఒక్కరే హాజరు కావడంతో, దానిని రద్దు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ మధుకర్, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈలు మధు, రాజేందర్, ఆర్‌ఐ మజార్, సిబ్బంది పాల్గొన్నారు.



టెండర్లు ఓపెన్ చేస్తున్న మారుతిప్రసాద్

బొగ్గుబాయి వార్తలు

నియామకాలు చేపట్టాలి



ఎస్‌ఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో సెక్యూరిటి సిబ్బంది పదవీ విరమణ అవుతున్నా, తిరిగి వారి స్థానంలో నియామకాలు చేపట్టడం లేదని వెంటనే సిబ్బంది నియామకాలు చేపట్టాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఏరియాలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి ఎస్‌ఎస్‌వో నగునూరి రవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌గోపాల్, బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, మహమ్మద్ ఆరీఫ్, రాజేందర్, సంజీవ్, వెంకటేష్, భరత్ తదితరులు ఉన్నారు.

సమాన ప్రాతినిధ్యం కల్పించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేంత వరకు అన్ని కమిటీల్లో జాతీయ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు ఆర్కే 7సేఫ్టీ అధికారి రవిశంకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. మైన్స్ కమిటీ, ఫిట్ కమిటీ, టెంపుల్ కమిటీలో జాతీయ సంఘాల సంఘాల నాయకులను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ నిరుపేద విద్యార్థికి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు ఆర్థికసాయం అందించారు. అధికారులు పోగుచేసిన రూ.5వేలను శుక్రవారం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా విద్యార్థి తండ్రి కృష్ణయ్యకు అందించారు.

వ్యాసరచన పోటీలు

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అనురాధ, కల్పనాలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంల పేరుతో మోసం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూంలను కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం, ఒక్క డబుల్ బెడ్‌రూంను కూడా పేదలకు పంచకుండా మోసం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డు సాయి హనుమాన్‌నగర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను బీజేపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, స్థానిక ఎమ్మెల్యే ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద ప్రజలకు ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద ఇళ్లు కట్టిస్తామని అన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

స్కూల్ కిట్లు పంపిణీ

నస్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించడంలో తాము ఎల్లప్పుడూ ముందు ఉంటామని వెర్రబెల్లి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ తెలిపారు. నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం ఆయన 100మంది విద్యార్థులకు స్కూల్ కిట్లు, బ్యాగ్ నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు.

హ్యుందాయ్ ఎక్స్‌టర్ కారు ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: హ్యుందాయ్ సరికొత్త మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్ కారును శుక్రవారం గద్దెరాగడిలోని ప్రకాశ్ హ్యుందాయ్ షోరూంలో క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జి.వెంకట రమణ, మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజు, లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ నల్ల దినేష్‌రెడ్డి మాట్లాడుతూ హ్యుందాయ్ మోటర్ ఇండియా ప్రారంభ స్థాయి ఎస్‌యూవీ (స్పోర్ట్ యుటిలిటి వాహనం)విభాగంలోకి అడుగు పెట్టిందని, తన విప్లవాత్మక ఉత్పత్తులు, సాంకేతికతలతో పరిశ్రమలో ఎల్లప్పుడూ కొత్త బెంచ్ మార్కులను సృష్టించిందన్నారు. మరోసారి ఎక్స్‌టర్ కారును వినూత్న డిజైన్, తెలివైన సాంకేతికత, అసాధారణమైన హ్యుందాయ్ నిబద్ధతను ప్రతిబింబించే ఎస్‌యూవీని పరిచయం చేస్తున్నామన్నారు. కారు ప్రత్యేకతలను తెలియజేశారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ రాజ్‌కుమార్, టీఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌టర్ కారును ఆవిష్కరిస్తున్న మందమర్రి, క్యాతన్‌పల్లి, లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్లు

చంద్రయాన్–3 వీక్షించిన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: చంద్రయాన్–3 బాహుబలి రాకెట్ ఎల్‌వీ, ఎం.3, ఎం.4 ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి గగణ విహారం చేసిన అరుదైన క్షణాలను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం వీక్షించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ప్రత్యేక డిజిటల్ బోర్డుపై తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, యోగేశ్వర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

జీపీ కార్యాలయానికి భూమిపూజ

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్‌లో రూ.20లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన జీపీ భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ గాండ్ల శంకరవ్వ, ఉపసర్పంచ్ పూరెల్ల చిన్న లక్ష్మణ్ భూమిపూజ చేశారు.

పట్టణ ఆర్యవైశ్య సభ్యులకు సన్మానం

మంచిర్యాలటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులను లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

బస్‌పాస్‌లు అందజేత

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన రెడ్డి మహిళా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 100మంది విద్యార్థినులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు.

పద్దనపల్లిలో గ్రామసభ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పద్దనపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఈజీఎస్ సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. గత మూడేళ్లుగా ఈజీఎస్ కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తయారు చేసిన నివేదికను సోషల్ ఆడిట్ గ్రామసభలో సామాజిక తనిఖీ బృందం అందరి ముందు చదివి వినిపించారు.

రూ.50వేలు ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో 16న నిర్వహించే పోచమ్మ కొలుపు సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ ఎనగందుల సతీష్ రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. శంకర్‌పల్లెలోని హనుమాన్ టెంపుల్ నిర్మాణం కోసం అడప రాములు రూ.25,016సర్పంచ్ ఒడ్నాల కొమురయ్యకు గ్రామస్తులతో కలిసి అందించారు.

హరితహారం టార్గెట్ పూర్తి చేయాలి

వేమనపల్లి: ఉపాధి కూలీలకు పనులు కల్పించి హరితహారం టార్గెట్ పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్ పాదయాత్ర

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి, లక్ష్మీపూర్, నాగాపూర్, పొన్నారం, దుబ్బపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పీసీసీ సభ్యుడు రమేష్ పాదయాత్ర చేపట్టారు. గడపగడపకూ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చెన్నూర్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో జనసేన రాష్ట్ర నాయకులు సిద్దూ ఫిర్యాదు చేశారు.